ప్రజల మాట ప్రగతి బాట

నర్సాపూర్/మెదక్/తూప్రాన్ నియోజకవర్గాలు


నిజాంపేట: నస్కల్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ సిద్ధిరాములు


వెల్దుర్తి: హస్తాల్‌పూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

# కారుకు జై కొడుతున్న ప్రజానీకం

## ప్రజల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రథమ కర్తవ్యం • గ్రామగ్రామాన బీఆర్‌ఎస్ శ్రేణుల ముమ్మర ప్రచారం

నిజాంపేట/వెల్దుర్తి, నవంబర్4: బీఆర్‌ఎస్ పార్టీ ఇంటింటికీ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేసింది. నిరుపేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ సిద్ధిరాములు అన్నారు. శనివారం నస్కల్‌లో ఇంటింటి ప్రచారంలో భాగంగా మెదక్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని కారు గుర్తుకే ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ గ్రామస్తులను కోరారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నదన్నారు. కారు గుర్తుకే ఓటు వేసి తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేత ఎల్లం యాదవ్, గ్రామ మహిళలు ఉన్నారు.

☛ వెల్దుర్తి, మాసాయిపేట మండలాల పరిధిలో జోరుగా సాగుతుండగా ప్రజలు సీఎం కేసీఆర్, కారు గుర్తుకు జై కొడుతున్నారు. శనివారం వెల్దుర్తి మండల పరిధిలోని హస్తాల్‌పూర్, నెల్లూర్, పెద్దాపూర్ గ్రామాల్లో మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆంజనేయులు, నాయకులు నర్సింలు, కృష్ణాగౌడ్, శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో మండల పార్టీ నాయకులు, ఆయా గ్రామాల నాయకులతో కలిసి ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. మ్యానిఫెస్టో కరపత్రాలతో ఇప్పటి వరకు చేసిన, చేయబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా సునీతా లక్ష్మారెడ్డిని, మూడోసారి సీఎంను గెలిపించాలని కోరారు.

☛ హస్తాల్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బత్తుల సాయిలు, బీజేపీ గ్రామ శాఖ అధ్యక్షుడు నాగభూషణం బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు అశోక్‌గౌడ్, పాండు, విష్ణు, మల్లేశం, వెంకట్‌గౌడ్, శేఖర్, శాఖారం శ్రీను, గంగాధర్, మల్లేశ్, సత్యనారాయణగౌడ్, బాలకిషన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

☛ నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో శనివారం నిర్వహించిన మైనార్టీల ఆత్మీయ సమ్మేళనానికి మాసాయిపేట మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, నాయకులు స్టేషన్‌శ్రీను, వేణుగోపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో ముస్లింలు తరలివెళ్లారు.

## ప్రతి కార్యకర్తకూ గుర్తింపు: జడ్పీటీసీ పబ్బ

శివ్వంపేట, నవంబర్ 4: శివ్వంపేట మండలం భీమ్లాతండాకు చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు దేవేందర్‌నాయక్‌తో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నర్సాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలోకి రావడం శుభపరిణామం అని, బీఆర్‌ఎస్ పార్టీలో ప్రతి కార్యకర్తకూ మంచి గుర్తింపు లభిస్తుందని, పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, సర్పంచులు లావణ్యామాధవరెడ్డి, కన్నారం దుర్గేశ్, చంద్రకళ శ్రీశైలం, బాలమణి నరేందర్, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, గ్రామ బీఆర్‌ఎస్ యువత అధ్యక్షుడు నరేశ్‌నాయక్, సీనియర్ నాయకులు సిలువేరి వీరేశం, రాజశేఖర్‌గౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ నాయకులను బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎంపీపీ


దామరచెర్వులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రామాయంపేట రూరల్, నవంబర్4: రామాయంపేట మండలం దామరచెర్వు గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రామాయంపేట వ్యవసాయ పరపతి సహకార సంఘం(పీఏసీఎస్)సహాయ కార్యదర్శి పిట్ల శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. రైతులు ధాన్యం దళారులకు అమ్మకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలని, కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఇన్‌చార్జి దినేశ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.


నందగోకుల్‌లో వరి పంట కోత ప్రయోగంలో పాల్గొన్న అధికారులు

## వరి పంట కోత ప్రయోగం

నిజాంపేట, నవంబర్4: మండలంలోని నందగోకుల్‌లో అధికారులు వరి పంట కోత ప్రయోగం పాల్గొన్నారు. గ్రామానికి చెందిన కొమ్మిడి లక్ష్మి వ్యవసాయ పొలం సర్వే నంబర్ 1425లో శనివారం డివిజనల్ ఉప గణాంక అధికారి వెంకటేశం, మండల ప్రణాళిక గణాంక అధికారి సందీప్‌రెడ్డి వరి పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. పంట కోత ప్రయోగంలో భాగంగా 5-5 మీటర్ల విస్తీర్ణంలో వరి పంట కోత ప్రయోగం చేయగా ధాన్యం బరువు 18.782 కేజీలు వచ్చిందని, ఒక ఎకరంలో దాదాపుగా 28-30 క్వింటాళ్ల వరకు వరి ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కార్యక్రమంలో స్థానిక రైతులు ఉన్నారు.

## మెహర్ బాబా దైవ సమానుడు


మెహర్‌బాబా నూతన ఆలయం

రామాయంపేట, నవంబర్ 4: ఎలాంటి ఆపద వచ్చినా బాబాను నమ్ముకోవాలని, నమ్ముకుంటే సర్వ కష్టాలు మాయమవుతాయని అవతార్ మెహర్ బాబా సీనియర్ శిష్యుడు రామకృష్ణయ్య అన్నారు. శనివారం అవతార్ మెహర్‌బాబా నూతన భవన నిలయాన్ని రామాయంపేటలో ప్రారంభించి కేకు కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో రామచంద్రం, ఏలూరి రవీందర్ గుప్తా, ఇందూరి రామాగౌడ్, బచ్చు ప్రభాకర్, కొత్త శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం బ్రేక్‌ఫాస్ట్‌తో విద్యార్థులకు ఎంతో మేలు


దామరచెర్వులో 'సీఎం బ్రేక్ ఫాస్ట్' ప్రారంభిస్తున్న సీఎంవో

రామాయంపేట రూరల్, నవంబర్ 4: తెలంగాణ ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న 'సీఎం బ్రేక్ ఫాస్ట్' కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతున్నది. ఉదయాన్నే పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ఆకలి బాధలను తీర్చలనే గొప్ప ఉద్దేశంతో ఈ పథకం ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా రామాయంపేట మండలం దామరచెర్వు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం 'సీఎం బ్రేక్ ఫాస్ట్' కార్యక్రమాన్ని సీఎంవో (కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్) సతీశ్, పాఠశాల హెచ్‌ఎం నర్సాగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'సీఎం బ్రేక్ ఫాస్ట్'లో గోధుమ రవ్వ, ఉప్మా, బియ్యం రవ్వ కిచిడీ, చట్నీ, సాంబార్, రవ్వ పొంగల్‌తో పాటు తదితర బ్రేక్ ఫాస్ట్ అందించడం జరుగుతున్నదన్నారు. 'సీఎం బ్రేక్ ఫాస్ట్' తో విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు, బడుల్లో హాజరుశాతం కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్నదన్నారు.


చిలిపిచెడ్: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న సంతోషిమాత

## ఓటు హక్కు వినియోగించుకోవాలి

చిలిపిచెడ్, నవంబర్ 4: మండలంలో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని మండల ఐసీడీసీ సూపర్‌వైజర్ సంతోషిమాత సూచించారు. శనివారం మండల కేంద్రమైన చిలిపిచెడ్ అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం సంతోషిమాత మాట్లాడుతూ ఓటు హక్కును అమ్ముకోకుండా, ఎలాంటి బహుమతులు తీసుకోకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి యువకుడి మృతి


కుర్ర రాజు(ఫైల్)

చేగుంట, నవంబర్4: ప్రమాదవశాత్తు ఓ యువకుడు కాలు జారీ చెరువులో పడి మృతి చెందిన ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్‌పల్లిలో శనివారం జరిగింది. చేగుంట పోలీసులు కథనం ప్రకారం కర్నాల్‌పల్లికి చెందిన కుర్ర రాజు(30) పెద్దమ్మ మూడు రోజుల క్రితం మృతి చెందగా, మూడు రోజుల కార్యక్రమానికి వెళ్లి చెరువులో స్నానం కోసం దిగగా ప్రమాదవశాత్తు కాలు జారీ చెరువులో పడ్డాడు. స్థానికుల సహకారంతో చెరువునుంచి బయటకు తీసి దవాఖానకు తరలిస్తుండగా రాజు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా దవాఖానకు తరలించినట్లు ఎస్‌ఐ హరీశ్‌గౌడ్ వెల్లడించారు.

## కుమ్మరులకు ప్రాధాన్యతనివ్వాలి


చిలిపిచెడ్‌లో మండల కుమ్మరి సంఘం కార్యవర్గం సభ్యులు

చిలిపిచెడ్, నవంబర్ 4: కుమ్మర కులవృత్తులకు పెన్షన్, కుమ్మరిబంధుతోపాటు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యతను కల్పించాలని నర్సాపూర్ నియోజకవర్గం కుమ్మరి సంఘం అధ్యక్షుడు కుమ్మరి శంకరయ్య కోరారు. శనివారం చిలిపిచెడ్ మండల కేంద్రంలోని కుమ్మరుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నియోజకవర్గం ప్రచార కార్యదర్శి గంగయ్య ఆధ్వర్యంలో మండల నూతన కార్యవర్గను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కుమ్మరి సంఘం అధ్యక్షుడిగా కుమ్మరి యాదగిరి(చండూర్), గౌరవ అధ్యక్షుడిగా కుమ్మరి నాగయ్య(చిట్కుల్) ఉపాధ్యక్షుడిగా రమేశ్ (జగ్గంపేట), ప్రధాన కార్యదర్శిగా రవీందర్(ఫైజాబాద్), కోశాధికారిగా అనిల్ (చిలిపిచెడ్), ప్రచార కార్యదర్శిగా రామకృష్టయ్య, సహాయ కార్యదర్శి పెంటయ్య, మండల సోషల్ మీడియా అధ్యక్షుడిగా కుమ్మరి దేవదాస్‌తోపాటు కార్యవర్గ సభ్యులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో చండూర్ ఉప సర్పంచ్ రాజ్ కుమార్, కుమ్మరి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## యువకుడి అదృశ్యం

శివ్వంపేట, నవంబర్ 4: యువకుడు అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై రవికాంత్‌రావు కథనం ప్రకారం.. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన మేదరి నర్సింలు కుమారుడు మేదరి విజయ్‌కుమార్(26) ఈ గత నెల 31వ తేదిన మనోహరాబాద్‌లో ఓ కంపెనీలో ఇంటర్వ్యూ ఉందని చెప్పి వెళ్లాడని, మళ్లీ ఇంటికి తిరిగి రాలేదని, చుట్టుపక్కల, తెలిసిన బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికాంత్‌రావు వెల్లడించారు.